# మూగ చెవిటీ, గుడ్డి కుంటీ

-అవసరాల రామకృష్ణారావు

"రకరకాల వికలాంగులతో దేశం నిండి పోయి ఉంది. అన్యాయాన్ని అడ్డుకొని మేధావులే అసలైన మానసిక వికలాంగులు" అంటూ మా అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు అసూయపరులు పరోక్షంగా మామీద నిందలు మోపుతుంటే మేమేం అక్ష్య పెట్టం. ఎందుకంటే మేం చేసే మంచి పనులు మాకు తెలుసు. మేం పుట్టి పెరిగిన చినకొండపల్లిని ప్రగతి పథంలోకి మళ్లించడంలో మా కృషి మేం ఎరిగినదే.

నాటికీ నేటికీ ఊళ్లో పెద్దబుర్రలం మేం నలుగురమే. అంటే వ్యాఘ్రేశ్వర శాస్త్రి అనే నేనూ, నాగరాజూ, కరివరదశెట్టి, వరాహరెడ్డీ, మా పల్లె నుంచి ప్రతి రోజూ మూడు మైళ్ల దూరంలో ఉన్న పెదకొండపల్లికి నడిచి వెళ్లి అక్కడి ఎలిమెంటరీ స్కూల్లో చదువు వెలిగించిన వాళ్లం మేం నలుగు రమే. ఆపైన వేర్వేరు కాలేజీల్లో డిగ్రీలు పొందినా జన్మభూమిని ఉద్ధరించాలనే భావజాలానికి కట్టుబడి తొడకొట్టింది మేం నలుగురం మాత్రమే.

మాకు ఏం మేలు జరిగినా మా ఊరికొండపై వెలిసిన అమ్మ కొండమ్మ తల్లి చలవ వల్లనే. మా చిన్నతనంలో ఆ తల్లి పేరున ఏడాదికోసారి జరిగే కాగడాల జాతర మేం ఎప్పుడూ మరచిపోలేం. మాది మారుమూల అటవీ ప్రాంతం. అంతెత్తు కొండమీద ఆ పాడుపడిన గుడిలో ఓ పక్కకి ఒరిగి పోయి ఓ చెయ్యి విరిగిపోయిన రాత్రి విగ్రహం. అయినా ఆ తల్లిని మొక్కకున్న వాళ్లకి ఏం తక్కువ!

పొందిన డిగ్రీలు కాక ఓ జీవితకాలం పాలు కాలుమీద కాలేసుకుని బతికే రాజకీయ పరిజ్ఞానం పుణికి పుచ్చుకుని మళ్లీ ఆ ఊరు చేరుకున్నామంటే ఆ తల్లి దయకాక మరేమిటి! రుణం తీర్చుకోవద్దా! తగిన పథకం వేసుకుని మా ఊరి రూపు రేఖలే మార్చేశాం! ఆ కుగ్రామాన్ని ఇప్పుడో ఆధునిక చిరునగిరిగా మార్చడంలో మా కృషి తక్కువదా!

అందుకే ఈ అభివృద్ధిలో ఇంకెవర్నీ వేలు పెట్టనివ్వం. పత్రికా విలేకర్లకి కూడా సర్వసాధార ణంగా మేం ఇంటర్వ్యూలు ఇవ్వం. అయితే ఎయిర్ కండిషన్ రూముల్లో కూచుని మాలో మేం అప్పుడప్పుడు చేసుకొనే రహస్య ప్రసంగాలకి మాత్రం అడ్డుండదు. మా పల్లె పురోభివృద్ధికి మార్గదర్శకాలుగా చర్చలు జరగాలి కదా! మాట వరసకి మా నాగరాజు ఇలా అంటూంటాడు.

"లాప్‌టాప్‌ల ధర్మమా అని ఎక్కడెక్కడి ఎప్పటెప్పటి ఇన్ఫర్మేషనూ చెవిలో పడుతోంది. అర్బన్ బ్యాంకులూ, చిట్‌ఫండ్ కంపెనీలు ఎన్నిసార్లు దోపిడీ చేసినా ఎగబడి డిపాజిట్లు కట్టే 'ఎర్రినాయాళ్లు' ఉన్నంతకాలం మన్లాంటి వాళ్లకి మరో వ్యాపారం దేనికి! ఈ అయిదారేళ్లలోనే మన వాళ్లు వెయ్యి కోట్లు సమర్పించుకున్నారంటే వేరే వ్యవహారం ఎందుకు? తనకే నేర ప్రవృత్తి ఉంది గనక మన ప్రభుత్వానికి వాళ్లని పట్టుకొనే సాహసం ఎప్పుడు ఉండదు. ఇక అలాంటిదే తెలివైన వాడి కైనా రహదారి. దైవం ఆశీర్వాదం, సంఘం ఆమోదం ఉన్నంతకాలం ఎలాంటి ఇచ్చి పుచ్చు కోడాలూ పుచ్చిపోవు. నా కూతురి పెళ్లికి అయిదు లక్షల కట్నం ఇచ్చి మరో మడూ లక్షల్తో పెళ్లి వైభవంగా చేశాను. రేపొద్దున్న నా కొడుక్కి ఏ అరకోటికో బేరం పెట్టినా! నోరు పడిపోయిన సంస్కర్తల్నందర్నీ నా కొడుకు పెళ్లికి ఆహ్వా నించనా!"

మా కరివరద శెట్టిది మరో రకం ధోరణి:

"మన చినకొండపల్లెనే తీసుకుందాం. కాస్త అభివృద్ధిలోకి వచ్చాక ఇక్కడ వ్యవసాయం, చేనేత లాంటి గ్రామీణ వృత్తులు నెలకొన్నాయి. వ్యవసాయాధార పరిశ్రమల కోసం శాస్త్రీయంగా పని చెయ్యడానికి మన ప్రభుత్వం దానికి అనుబంధ సంస్థగా విద్యుదుత్పత్తి ఏర్పాటు గాని, చెరకు పిప్పి ఆధారంగా కాగితం పరిశ్రమ గాని పెట్టిందా, లేదే! పొగాకు పండే ప్రాంతంలో సిగరెట్టు ఫ్యాక్టరీ గాని ప్రత్తి మిల్లులకి జవుళి పరిశ్రమగాని నెలకొల్పిందా, లేదే! ఇలాంటి ఎన్ని అసందర్భాలున్నా చెవులు మూసుకునే ప్రజలు ఎంతమందైనా ఉన్నారు. అలాంటి వారి చెవులు

పట్టుకు ఆడిస్తే ఆ తప్పు మనదా! మొన్నటికి మొన్న ఆ మిడిల్ స్కూల్ బిల్డింగ్ వ్యవహారంలో నేనీ రెండు కోట్లు నొక్కేశానని పుకారు. అందులో సగమైనా నిజమే కావొచ్చు.విన్నదేదో పట్టించుకుని తిరగబడే వాళ్లు లేనంతకాలం మన ధీమాకి ఏదీ ఢోకా!"

వీరిద్దర్నీ మించింది వరాహరెడ్డి వాగ్ధాటి.

"బద్ధకం గుణ వర్ధకం" అని మనవాళ్లు భావించినంత కాలం మనదే రాజ్యం. ఇంటో ఆడాళ్లకి చీచీ అనిపించే టీవీ సీరియల్సూ, ఆఫీసుల్లో మగాళ్లకి సీట్లకి బందిల్నీ చేసి ఫైలు తెప్పించే ఫైల్సూ, పిల్లలకి స్కూళ్లలో కాలేజీల్లో రిలీఫ్ ఎరగని నాన్‌స్టాప్ తోమడు కాక రేంకు కోసం రకరకాల రంకు వేషాలూ, ఇలా ఏ వయసుకి ఆ మేకుకి తాపడం అయిపోయి. దేకడం కూడా మరచి పోయింది ప్రజల. ఇక మన లాంటి వారి ధాటికి ఏదీ పోటీ? నాతో పెట్టుకున్న రీటా బతులకు ఏమైంది. ఆడా మగా కలుసుకుంటే కలిసొచ్చేది మగాడి కానీ కడుపొచ్చేది ఆడదానికనీ ఆ మాత్రం ఎరగదా! రీటా బతుక్కే చెప్యెయ్యానా టాటా!!

ఇక మా వాళ్ల ముందైనా నోరు విప్పి చెప్పక పోతే నా వంతు కృషికి ఏదీ నగీషీ? "ఎక్కడికక్కడ భక్తి పారవశ్యాలతో శఠగోపానికి తలవంచుతారు. గాని తలెత్త శక్తి సామర్థ్యాలు చాటే సత్తా మనవాళ్లకేదీ? ఆ బలహీనతల్ని పెట్టుబడిగా పెట్టుకునే మనలాంటి వాళ్లం రియల్ ఎస్టేట్ వ్యాపారుస్థులుగా మారిపోతున్నాం. రాజధాని నుంచి రాబడీ పలుకుబడీ పొందుతున్నాం. చిన్నచిన్న చెరువుల్ని కప్పించి మన ఊళ్లో కాలనీలగా మార్చేసింది మనమే. కొన్నిటిని పార్కులు చేశాం. చిన్న నదిలాంటిది ఉండేది కదా. దాన్ని మళ్లించి రోడ్లేయించాం. ఇంత చిన్న ఊరికి అన్ని ఆటస్థలా లెందుకని భవంతుల సముదాయా లుగా తీర్చిదిద్దాం. వాతావరణ సమతౌల్యం దెబ్బ తింటుందనే గోల దేనికి! ఇంతకీ అసలైన అభివృద్ధి కార్యక్రమం ఏదో మా దప్పు మేం కొట్టుకోవాలా? మా గ్రామస్తుల నుదటి రాత తీర్చి దిద్దేది అమ్మకొండమ్మ తల్లే కదా! తల్లి బాగుంటేనే కదా పిల్లలు బాగుండేది! ఇరవై లక్షలు ఖర్చుపెట్టి కొండమీది గుడిని పునర్నిర్మించాం. కింద నుంచి పైదాకా వెడల్పైన మెట్లుకట్టించాం. ఆ రోజుల్లో ఎప్పుడో ఏడాదికోసారి కార్తీక పున్నమనాడు కాగడాల జాతర. ఇప్పుడో? ప్రతి రాత్రీ ఎలక్ట్రిక్ బల్బు కాంతుల పున్నమే! ఇప్పుడెంచక్కా ఆ మెట్ల పొడుతునా ఎప్పుడు బిచ్చగాళ్లే!"

మాట వరసకి మూగా చెవిటి గుడ్డీ కుంటీ అని చెప్పుకుని ఆడుక్కునే నలుగురు బిచ్చగాళ్లు కబురిల్లా ఉంటాయి.

"నేను మాటాడగలిగితే ఎంత బావుణ్ణు' అంటాడు మూగవాడు.

"నీకు మాట్టాడ్డం రాదని చెబుతున్నావు గానీ ఏదీ, ఆ ముక్క నా చెవిలో పడందే!" అని చెవిటివాడి జవాబు.

'మీ ఇద్దర్లో ఒకడు నలుపు. మరొకడు తెలుపూ అలా నాకు కనపడి చావదు కదా!' అంటాడు గుడ్డివాడు.

'ఉండండి, పరిగెత్తుకు వస్తున్నాను' అంటాడు కుంటివాడు ఆ పని చేస్తూ. మెట్ల మీది కబుర్లకేం గాని అమ్మకొండమ్మ తల్లికో వెండి కటకటాల భద్రతా, దానికో సెక్యూరిటీ రక్షణా మా ఏర్పాటే. విరిగి ఉన్న ఆ మూల విరాట్టును సరిచేద్దామని ఓ అమాయక కూలీ ప్రయత్నించాడో లేదో రక్తం కక్కుకు చచ్చిపోయాడనే నిజం ఉండనే ఉంది. తల్లి మహిమా దాన్ని పోషించే పిల్లల ఘనతా ఏదీ తక్కువని!

మేం నలుగురమే దగ్గరుండి విగ్రహాన్ని సముద్ధరించే ప్రయత్నంలో మరో అదృష్టం బయట పడిందనేది మాకే తెలిసిన రహస్యం!

ఆ అమాయకపు కూలీ ఇలా గునపం పోటు వేశాడో లేదో అలా లంకెలబిందె ఉన్న ఖంగుమనే శబ్దం బయట పడింది. వాడు బతికుంటే ఆ పోటులో వంతు కడతాడని వాడి గుండెపోటు ఆపించాం. వెనక నుంచి పొడిచాం గనక రక్తం కుక్కుకు చచ్చినట్టే భ్రమ కలిగించడం సులువైంది.

ఏదో మా పల్లెటూరి ప్రజలకింత సేవ చేసుకుని తరిస్తున్నాం. ఏం జరిగినా ఆ అమ్మకొండమ్మ తల్లిచలవ వల్లేకదా!

■